ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
మంగళవారం 26 మార్చి 2024





రంగుల కేళీ..

- వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో అట్టహాసంగా హోలీ సంబురాలు
- ఊరూవాడా రంగుల మయం
- యువత బైక్ ర్యాలీలు.. కేరింతలు



పరిగిలో హోలీ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



ధారూరులో..



డోలు కొడుతున్న యువకుడు

వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో సోమవారం హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నా పెద్దా తేడా లేకుండా గ్రామాల నుంచి మున్సిపాలిటీల వరకు పెద్ద ఎత్తున రంగుల పండుగను జరుపుకున్నారు. వికారాబాద్ జిల్లాలోని తాండూరు, పరిగి, కొడంగల్,వికారాబాద్ నియోజకవర్గాలతో పాటు మండల కేంద్రాలు, గ్రామాల్లో వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు. వికారాబాద్ జిల్లాలో యువకులు బైకులపై వీధుల్లో తిరుగుతూ కలర్స్ గుప్పుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. హోలీ వేడుకల్లో వివిధ పార్టీల ప్రజా ప్రతినిధులు పాల్గొన్ని జోష్ నింపారు. పరిగిలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో చిన్నా పెద్దా తేడా లేకుండా రంగుల్లో మునిగి తేలారు. మేడ్చల్, శామీర్‌పేట, మూడుచింతలపల్లి, ఘట్‌కేసర్, కీసర మండలాల పరిధిలో వేడుకలను ప్రశాంతంగా జరుపుకున్నారు.

- మేడ్చల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)



దోమ మండలం బొంపల్లిలో హోలీ సంబరాల్లో యువకులు





కీసరలో కాముడి దహనం

వైభవంగా పాంబండ గిరిప్రదక్షిణ



ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

కులకచర్ల, మార్చి 25: కులకచర్ల మండలంలోని బండవెల్కిచర్ల గ్రామ పాంబండ 15వ గిరిప్రదక్షిణలో వైభవంగా సాగింది. ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డితో పాటు వేలాది మంది భక్తులు హాజరయ్యారు. సోమవారం పౌర్ణమి కావడంతో హిందూబంధువుల ఆధ్వర్యంలో పాంబండ గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అర్చకులు పాండుశర్మ శ్రీ రామలింగేశ్వరస్వామి దర్శనం కల్పించారు. ప్రతీ ఒక్కరు భక్తి భావం కలిగి ఉండాలని ఎమ్మెల్యే తెలిపారు. గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులకు గ్రామానికి చెందిన గోవర్ధన్ అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, వక్త భాస్కరయోగి, మాజీ ఎంపీపీ అంజిలయ్యగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, మహిళాఅధ్యక్షురాలు లక్ష్మీ ఆనంద్, ఎంపీటీసీలు ఆనంద్, జ్యోతి లక్ష్మీ, నిర్వాహకులు నర్సింహారెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



మరమ్మతుకు నోచని వాటర్‌ట్యాంక్

పర్వత్‌పల్లిలో తాగునీటి కష్టాలు

- పని చేయని బోరు .. పట్టించుకోని అధికారులు

బషీరాబాద్, మార్చి 25: మండలంలోని పర్వత్‌పల్లి గ్రామంలో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. మల్లన్న దేవాలయం వద్ద డైరెక్టు పంపింగ్ సిస్టం బోరు పనిచేయడం లేదు. దీంతో పరిసర ప్రాంత ప్రజలు నీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో మిషన్ భగీరథ నీరు రోజు విడిచి రోజు వస్తుండడంతో తాగునీటి సమస్య తలెత్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే ఎండకాలం.. ఆపై నీరు దొరకక పడరాని పాట్లు పడుతున్నారు. ఇక్కడి బోరు మరమ్మతు చేయక దాదాపు రెండు నెలలు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఈ విషయమై ప్రత్యేకాధికారి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.




అతివలే కీలకం!

పార్లమెంట్ ఎన్నికల్లోనూ మహిళలదే నిర్ణయాధికారం

అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగానే పార్లమెంట్ ఎన్నికల్లో సైతం అతివలే కీలకం కానున్నారు. అభ్యర్థుల గెలుపోటముల్లో మహిళా ఓట్లే ప్రధానం కానున్నాయి. జిల్లాలో అత్యధిక ఓటర్లు పరిగి నియోజకవర్గంలో 2,65,522 మంది నమోదు కాగా, అత్యల్పంగా వికారాబాద్ నియోజకవర్గంలో 2,30,839 మంది ఓటర్లు ఉన్నారు. పరిగి నియోజకవర్గం మినహా వికారాబాద్, తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు.

- తాండూరు, కొడంగల్, వికారాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లే అధికం
- పరిగిలోనూ పురుష, మహిళా ఓటర్లకు మధ్య తేడా స్వల్పమే
- జిల్లాలో పెరిగిన ఓటర్లు

వికారాబాద్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : కేంద్ర ఎన్నికల సంఘం ఈనెల 15వ తేదీ వరకు నమోదైన ఓటర్ల జాబితాలో వికారాబాద్ జిల్లాలో పురుషుల కంటే మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోకి జిల్లాలోని తాండూరు, పరిగి, వికారాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు చేవెళ్ల నియోజకవర్గం పరిధిలోకి వచ్చే నవాబ్‌పేట్ మండలం ఉంది. కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గం మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోకి వస్తుంది. జిల్లాలో 9,79,166 మంది ఓటర్లుగా నమోదైనట్లు ఇటీవల ఎన్నికల సంఘం ప్రకటించింది. , జిల్లాలో అత్యధిక ఓటర్లు పరిగి నియోజకవర్గంలో 2,65,522 మంది నమోదు కాగా, అత్యల్పంగా వికారాబాద్ నియోజకవర్గంలో 2,30,839 మంది ఓటర్లు ఉన్నారు. తాండూరు నియోజకవర్గం పరిధిలో 2,41,950 మంది ఓటర్లు ఉండగా, కొడంగల్ నియోజకవర్గంలో 2,40,855 మంది ఓటర్లు ఉన్నారు. పరిగి నియోజకవర్గం మినహా వికారాబాద్, తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. తాండూరు నియోజకవర్గం పరిధిలో 2,41,950 మంది ఓటర్లు ఉండగా, వారిలో 1,17,242 మంది పురుషులు, 1,24,701 మంది మహిళా ఓటర్లు, 7 మంది టీజీ ఓటర్లు ఉన్నారు. ఈ నియోజకవర్గంలో పురుషుల కంటే 7,459 మంది మహిళా ఓటర్లు అధికంగా నమోదయ్యారు. వికారాబాద్ నియోజకవర్గం పరిధిలో 2,30,839 మంది ఓటర్లు ఉండగా, వారిలో 1,14,566 మంది పురుషులు, 1,16,261 మంది మహిళలు, టీజీ ఓటర్లు 12 మంది ఉన్నారు. ఈ నియోజకవర్గంలో పురుషుల కంటే మహిళా ఓటర్లు 1,695 మంది ఎక్కువగా నమోదయ్యారు. పరిగి నియోజకవర్గం పరిధిలో 2,65,522 మంది ఓటర్లు ఉండగా, వారిలో పురుషులు 1,33,100 మంది ఉండగా, 1,32,413 మంది మహిళలు, 9 మంది టీజీ ఓటర్లు ఉన్నారు. కాగా, మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే కొడంగల్ నియోజకవర్గంలో మొత్తం 2,40,855 మంది ఓటర్లు ఉండగా, వారిలో 1,18,446 మంది పురుషులు, 1,22,404 మంది మహిళలు, టీజీ ఓటర్లు 5 గురు ఉన్నారు. ఈ నియోజకవర్గంలో పురుషుల కంటే 3,958 మంది మహిళా ఓటర్లు అధికంగా నమోదయ్యారు.



మూడు నెలల్లో పెరిగిన 18,790 మంది ఓటర్లు

గత ఏడాది నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయానికి, ఈనెల 15వ తేదీ వరకు నమోదైన ఓటర్ల సంఖ్యకు పోలిస్తే జిల్లాలో 18,790 మంది ఓటర్లు పెరిగారు. పెరిగిన ఓటర్లలో 5,826 మంది పురుషులు ఉండగా, 12,971 మంది మహిళలు, 3 గురు టీజీ ఓటర్లు ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఇప్పటి వరకు కొడంగల్ నియోజకవర్గం పరిధిలో 4,230 మంది ఓటర్లు పెరగగా, పెరిగిన ఓటర్లలో 1,143 మంది పురుషులు ఉండగా, 3,094 మంది మహిళలు ఉండగా, ఏడు గురు టీజీ ఓటర్లు తగ్గారు. తాండూరు నియోజకవర్గంలో 5,874 మంది ఓటర్లు పెరగగా, వీరిలో 2,099 మంది పురుషులు, 3,774 మంది మహిళలు, ఒకరు టీజీ ఓటరు ఉన్నారు. వికారాబాద్ నియోజకవర్గంలో 2,586 మంది ఓటర్లు పెరగగా, పెరిగిన ఓటర్లలో 647 మంది పురుషులు, 1,940 మహిళలు ఉండగా, ఒక టీజీ ఓటరు తగ్గారు. పరిగి నియోజకవర్గంలో 6,100 మంది ఓటర్లు పెరగగా, పెరిగిన ఓటర్లలో 1,937 మంది పురుషులు, 4,163 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. కొత్తగా ఓటర్ల నమోదుకు ఇంకా గడువు ఉండగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు వస్తున్నాయి.

ఓటర్ల వివరాలు

	2023, నవంబరు	2024, మార్చి 15 వరకు
జిల్లా ఓటర్లు	9,60,376	9,79,166
పురుషులు	4,77,528	4,83,354
మహిళలు	4,82,808	4,95,779
ఇతరులు	40	33

ఎలక్షన్ వేళ

'గులాబీ'లో గుబులు

- తాండూరు నియోజకవర్గంలో కారు ఖాళీ?
- ఒక్కొక్కరు దిగుతున్న వైనం
- కాంగ్రెస్, బీజేపీ వైపు బీఆర్ఎస్ శ్రేణుల చూపులు

తాండూరు, మార్చి 25 : పార్లమెంటు ఎన్నికల వేళ బీఆర్ఎస్ పార్టీకి షాక్ మీద షాక్‌లు తగులుతున్నాయి. ఒక్కొక్కరుగా కారు దిగుతున్నారు. చేవెళ్ల పార్లమెంటు పరిధిలో తాండూరు నియోజకవర్గ ఓటర్లు అన్ని పార్టీలకు ప్రధానమే. ఈ నేపథ్యంలో అధికారం కోల్పోయిన మూడు నెలలలోపే బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు ఒక్కొక్కరుగా పార్టీని వీడి కాంగ్రెస్, బీజేపీ గూటికి చేరుతున్నారు. నియోజవర్గం పరిధిలో తాండూరు పట్టణంతో పాటు పెద్దేముల్, యలాల, బషీరాబాద్, తాండూరు, కోట్‌పల్లి మండలాలు ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల తర్వాత తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, కౌన్సిలర్లు వెంకన్న, రామకృష్ణ (రాము), నియోజకవర్గ స్థాయి నాయకుడు కరుణం పురుషోత్తం రావు, మాజీ జడ్పీటీసీ సిద్రాలశ్రీనివాస్, అధికార కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ పార్లమెంటు ఎన్నికల తర్వాత చేర్చుకుంటామని కాంగ్రెస్ నేతలు హామీ ఇచ్చినట్లు సమాచారం. తాజాగా సోమవారం యాలాల ఎంపీసీ బాలేశ్వర్‌గుప్తా బీజేపీలో చేరారు. తాండూరు నియోజవర్గంలోని బీఆర్ఎస్ శ్రేణులు అధికార కాంగ్రెస్, బీజేపీలో చేరుతున్నారు. దీంతో స్థానిక బీజేపీ నాయకత్వం అయోమయంలో పడింది. గడిచిన మూడు నెలలగా బీఆర్ఎస్ పెద్దగా కార్యక్రమాలను చేపట్టలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో కోలుకోలేని ఆ పార్టీకి ప్రజాప్రతినిధులు, నాయకులు దూరమవడం మరో షాక్‌గా చెప్పవచ్చు. అసెంబ్లీ ఎన్నికల్లో రోహిత్‌రెడ్డి ఓటమి తర్వాత ఆడపదడపా వచ్చిపోవడమే తప్పా, పార్టీకి పూర్తి సమయం కేటాయించలేదని బీఆర్ఎస్ శ్రేణులు వాపోతున్నారు. ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల సయమంలో బీఆర్ఎస్ నాయకులు స్తబ్దుగా ఉండడంతో నాయకులు, కార్యకర్తలు ఎవరిదారి వారు చూసుకుంటున్నామని వాపోతున్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తాండూరు సెగ్మెంట్‌లో ఎన్నికల సభలను నిర్వహిస్తూ కార్యకర్తలు, నాయకులను ముందుకు నడిపిస్తున్నాయి. బీఆర్ఎస్ మాత్రం అభ్యర్థి గెలుపుకోసం ఎలాంటి సభలు, సమావేశాలు చేపట్టలేదు.



రేపు జరిగే కార్యకర్తల సమావేశం వాయిదా

ఈనెల 27న తాండూరు నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించాలని అధిష్ఠానం నిర్ణయించింది. అయితే చివరి నిమిషంలో ఈ సమావేశాన్ని వాయిదా వేశారు. గతంలో కూడా బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేస్తూ ఆ సమావేశానికి వర్కింగ్ ప్రెసిండెంట్ కేటీఆర్ వస్తున్నట్లు ప్రకటించారు. తర్వాత ఆ సమావేశాన్ని కూడా వాయిదా వేశారు. తిరిగి ఈనెల 27వ తేదీని నిర్ణయించగా మరోసారి వాయిదాపడడం చర్చనీయాంశంగా మారింది.

పోలీసుల తనిఖీలు.. రూ.లక్ష స్వాధీనం

దౌల్తాబాద్, మార్చి 25: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో దౌల్తాబాద్ మండలంలోని చంద్రకల్ చెక్‌పోస్టు దగ్గర పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో సోమవారం వాహనాలను తనిఖీ చేయగా, రూ.లక్ష పట్టుబడ్డాయి. కర్ణాటక ప్రాంతం నుంచి హైదరాబాద్‌కు కారులో వెళ్తున్న వాహనదారుడి దగ్గర రూ.లక్ష సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.



పట్టుబడిన నగదును చూపిస్తున్న ఎస్‌ఐ శ్రీశైలం

అప్పు భారంతో
యువరైతు ఆత్మహత్య

పెద్దేముల్, మార్చి 25: అప్పు భారమై ఓ యువరైతు ఊరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వికారాబాద్ జిల్లా పెద్దేముల్ గ్రామానికి చెందిన మారేపల్లి శ్రీనివాస్(26) తన సోదరి పెళ్లి కోసం నాలుగేళ్ల క్రితం తీసుకున్న అప్పు ఇప్పటికీ చెల్లించలేకపోయాడు. ఇదే విషయమై ఆదివారం తన తల్లితో అప్పు ఎలా తీర్చాలోనంటూ మదనపడ్డాడు. బయటకు వెళ్తున్నానని సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఊరంతా వెతికినా అచుకీ అభ్యం కాలేదు. అదే రోజు రాత్రి శ్రీనివాస్ తన పొలాంలో చెట్టుకు ఊరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం తెల్లవారుజామున పొలానికి వెళ్లిన బాబాయ్ కృష్ణయ్య గమనించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గిరి తెలిపారు.

త్వరలో బీఆర్‌ఎస్‌ను ఖాళీ చేయిస్తాం

మేడ్చల్ టౌన్, మార్చి 25: త్వరలోనే బీఆర్‌ఎస్ పార్టీని ఖాళీచేయించి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తామని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం పెద్దఎత్తున వజ్రేష్‌యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వజ్రేష్‌యాదవ్ మాట్లాడుతూ.. ఒంటెద్దు పోకడతో పదేళ్ల పాటు పరిపాలన కొనసాగించారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ పార్టీలో విసుగుచెందిన కార్యకర్తలు తమ పార్టీలో చేరుతున్నారన్నారు. గుండ్లపోంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కండ్లకోయకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు నేడు తమ పార్టీలో చేరడం అభినందనీయమన్నారు. పార్టీలో చేరుతున్న వారికి సముచిత స్థానం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. పార్టీలో చేరుతున్న వారు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థి విజయానికి కష్టపడి పనిచేయాలని కోరారు. మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డిని పక్కనపెట్టి నేడు చాలా మంది బీఆర్‌ఎస్ నాయకులు తమ రాజకీయ భవిష్యత్తు తీర్చిదిద్దుకోవటానికి కాంగ్రెస్‌లో చేరుతున్నారని అన్నారు. ప్రజాసేవ చేయదలచిన ప్రతీ ఒక్కరికి తమ పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కండ్లకోయ మాజీసర్పంచ్‌లు నరేందర్‌రెడ్డి, రవీందర్ గౌడ్, స్వామి, రాజేందర్ ముదిరాజ్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు షహనాగౌస్ ఖాన్‌లతో పాటు 200మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో గుండ్లపోచంపల్లి కౌన్సిలర్ సాయిపేట శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరుతున్న గుండ్లపోచంపల్లి మున్సిపల్ బీఆర్‌ఎస్ నాయకులు

మెపా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వెంకటయ్య

పరిగి, మార్చి 25: ముదిరాజ్ ఎంప్లాయీస్ ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా దోమ వెంకటయ్య, సందోళ్ల వెంకటయ్య, ఏదుల విజయ్‌కుమార్ , కార్యదర్శిగా జాలరి నర్సింహులు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్, ప్రధానకార్యదర్శి బి.సంజీవ్, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ బి.జగన్మోహన్‌ల చేతుల మీదుగా నియామకపు పత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మెపా లక్ష్య సాధనకు పనిచేస్తామని తెలిపారు. ముదిరాజ్‌ల సంక్షేమానికి మెపా పని చేస్తుందన్నారు. ముదిరాజ్‌ల హక్కుల సాధన కోసం కలిసి పని చేద్దామని అన్నారు.



వెంకటయ్యను సన్మానిస్తున్న రాష్ట్ర నాయకులు



జ్యోతి ప్రజ్వలనచేసి కార్యక్రమాన్ని ప్రాంభిస్తున్న బొగ్గారపు దయానంద్

విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేయాలి

» ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్

ఇబ్రహీంపట్నం, మార్చి 25 : నైపుణ్యాన్ని పెంచుకుని విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేయాలని, అప్పుడే ఉద్యోగాలు సాధించడం సులభతరం అవుతుందని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ అన్నారు. ఆదివారం రాత్రి ఇబ్రహీంపట్నం సమీపంలోని వినోబానగర్‌లో సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కేవలం డిగ్రీలు ఉంటే సరిపోదని వివిధ అంశాల్లో తగిన నైపుణ్యాన్ని పెంచుకుంటేనే పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణిస్తారన్నారు. చదువుతోపాటు హెచ్‌ఆర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో వివిధ అంశాల్లో నిపుణులచే విద్యార్థులకు తగు శిక్షణ ఇస్తున్నామని కళాశాల చైర్మన్ డా.జి.నాగయ్య అన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులకనుగుణంగా ముందుకు పోవాలని విద్యార్థులకు సూచించారు. సింగర్లు అనుదీప్, లిప్సిక, గోవిందాచార్య వారి ఆట, పాటలతో విద్యార్థులను అలరించారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలిచ్చారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ డా.డి.ప్రదీప్‌కుమార్, ప్రిన్సిపాల్ డా.పి.శేఖర్‌బాబు, డీన్ డా.కె.ఈశ్వర్ ప్రసాద్, వైస్‌ప్రిన్సిపాల్ డా.సుబ్బారావు పాల్గొన్నారు.



శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో పూజల్లో భక్తులు

వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

తలకొండపల్లి, మార్చి 25 : మండల పరిధిలోని దేవుని పడకల్ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. ఆలయం వద్ద భక్తులకు నిర్వాహకులు విశాల వసతులు ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాల మూడవ రోజు సోమవారం అర్చకులు నడదూర్ రామాచార్యులు, పరవస్తు గోపాలాచార్యులు, శ్రీనివాసాచార్యులు, చక్రవర్తిఆ చార్యులు, రామాచార్యులు ఆధ్వర్యంలో ఆదివారం ధ్వజారోహణం, భేరిపూజ, దేవతాహ్వానం, హోమం, బలిహరణం, సింహవాహన సేవ, ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లట్టుపల్లి రాజ్‌కుమార్‌రెడ్డి, ఈవో స్నేహలత, మాజీ సర్పంచ్ కాడెమోని శ్రీశైలం, మాజీ ఉపసర్పంచ్ రాజమోని తిరుపతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుమ్మరి శంకర్, పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న గూడూరు శ్రీనివా‌స్‌రెడ్డి

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

కడ్తాల్, మార్చి 25 : లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే ఘనవిజయమని, కేంద్రంలో అధికారంలోకి రావడం ఖాయమని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కడ్తాల మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 28న జరిగే ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి ఘన విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం స్థానిక సంస్థలను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజారంజక పాలన సాగిస్తోందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ అవకాశవాద మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని సూచించారు. రాష్ట్రంలో 14 ఎంపీ స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని, రాహుల్ ప్రధాని కావడం ఖాయమని చెప్పారు. సమావేశంలో మండల కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, నాయకులు మాలే మల్లేశ్‌గౌడ్, సత్యం, రాజేశ్, మంకిశ్రీను, పాల్గొన్నారు.



రాగమ్మను పార్టీలోకి ఆహ్వానిస్తున్న హరీశ్‌రావు

సొంతగూటికి చేరిన జడ్పీటీసీ

కొందుర్గు, మార్చి 25 : ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన కొందుర్గు జడ్పీటీసీ ఎదిరే రాగమ్మ తిరిగి సొంత గూటికి చేరారు. సోమవారం హైదరాబాద్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు ఇంట్లో ఆయన బీఆర్ఎస్ కండువా కప్పి, ఆమెను పార్టీలోకి ఆహ్వానించారు. అనివార్య కారణాల వల్లే తాను కాంగ్రెస్‌లోకి వెళ్లాలని, తిరిగి బీఆర్ఎస్‌లోకి రావడంతో సొంత ఇంటికి వచ్చినట్టుగా ఉందని రాగమ్మ చెప్పారు. ఎమ్మెల్సీ, లోక్‌సభ ఎన్నికల వేళ అధికార కాంగ్రెస్‌లోకి వలసలు కొనసాగుతుండగా, ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన ఆమె తిరిగి బీఆర్ఎస్‌లో చేరడంతో మండలంలో చర్చనీయాంశమయింది.



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఆదిభట్ల, మార్చి 25 : ఒకే చోట చదువుకొని వివిధ రంగాల్లో స్థిరపడి, క్షణం తీరిక లేకుండా గడుపుతున్న పాత స్నేహితులను హోలీ ఒక చోటికి చేర్చింది. 35 సంవత్సరాల తరువాత వారు హోలీ వేళ ఆత్మీయసమ్మేళనంలో కలుసుకొని గతంలోని గడిపిన ఆనంద క్షణాలను జ్ఞాపకం చేసుకొని ఉద్వేగానికి లోనయ్యారు. వివరాలిలా ఉన్నాయి. హైదరాబాదు పాతబస్తీ పలక్‌నామా, రాజన్నబావి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1987-88 బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థులు కొందరు ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడగా, మరి కొందరు వ్యాపారం చేస్తున్నారు. వారు ఈ రోజు ఆదిభట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్‌లో నిర్వహించిన ఆత్మీయసమ్మేళనంలో కలుసుకున్నారు. ఆత్మీయంగా ఒకరినొకరు పలకరించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముప్పై ఐదు సంవత్సరాల తరువాత హోలీరోజును ఎంచుకొని తాము కలుసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మతేజ, పద్మారావు,పండాల లక్ష్మీపతిగౌడ్, చంద్రశేఖర్, జైహింద్, హరికిషన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, కృష్ణమూర్తి, శ్రీనివాస్‌రావు, రాజేందర్, విక్రమ్, వెంకటాద్రి, శేఖర్, శ్రీకాంత్, యాదగిరి, శ్రవణ్, రామారావులు పాల్గొన్నారు.

హోలీ వేడుకల్లో విషాదం..
బీఆర్ఎస్ నాయకుడిపై కత్తితో దాడి

» తృటిలో తప్పిన ప్రాణాపాయం
» ఆసుపత్రికి తరలించిన గ్రామస్థులు, బంధువులు
» కమాల్‌రెడ్డిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

వికారాబాద్, మార్చి 25 : పాత కక్షలు మనసులో పెట్టుకుని, హోలీ వేడుకల్లో గ్రామ మాజీ సర్పంచ్‌పై కత్తితో దాడి చేసిన సంఘటన వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వికారాబాద్ మండలం పరిధిలోని పులుసుమామిడి గ్రామానికి చెందిన నారేగూడం కమాల్‌రెడ్డి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడిగా, గ్రామ సర్పంచ్‌గా పని చేశారు. సర్పంచ్ పదవీ కాలం ముగియడంతో కమాల్‌రెడ్డి వికారాబాద్‌లో నివాసం ఉంటూ గ్రామానికి వెళ్లి వస్తుంటారు. అయితే కమాల్‌రెడ్డి సర్పంచ్‌గా ఉన్న సమయంలో అదే గ్రామానికి చెందిన కొత్తగడి నాగిరెడ్డి, లలిత దంపతుల మధ్య గొడవలు తలెత్తాయి. లలిత బంధువులు ఏడాదిక్రితం గ్రామంలో పంచాయితీ పెట్టారు. సర్పంచ్ కావడంతో పాటు, గ్రామపెద్దగా కమాల్‌రెడ్డి వెళ్లి సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే నాగిరెడ్డిని మందలించడం, అదే సమయంలో లలిత బంధువులు నాగిరెడ్డిపై దాడి చేసే క్రమంలో తోపులాట జరిగింది. నాగిరెడ్డి కింద పడి చేయి విరిగింది. దీంతో కోపం పెంచుకున్న నాగిరెడ్డి కమాల్‌రెడ్డిని చంపుతానని గ్రామంలో చెప్పుకు తిరుగుతూ, అదను కోసం వేచిచూశాడు. హోలీ పండుగ సందర్భంగా కమాల్‌రెడ్డి స్వగ్రామానికి వెళ్లాడు. హోలీ ఆడుతుండగా నాగిరెడ్డి వచ్చి అతనిపై కత్తితో దాడి చేశాడు. కమాల్ రెడ్డి చేయి అడ్డు పెట్టడంతో చేతికి, మెడ భాగంలో గాయాలయ్యాయి. గమనించిన గ్రామస్థులు, బంధువులు వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి, ఆసుపత్రికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుడి కుమారుడు మహేశ్వర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగరాజు తెలిపారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కమాల్‌రెడ్డి

పాంబండ ఆలయంలో
ఎమ్మెల్యే దంపతుల పూజలు

కులకచర్ల, మార్చి 25: కులకచర్ల మండలంలోని బండవెల్కిచర్ల పాంబండ శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి ఉమారెడ్డితో కలిసి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన తిరుపతిరెడ్డి తన సొంత డబ్బుతో అమ్మవారికి చేయించిన వెండి కిరీటం, హన్మంత్‌రెడ్డి చేయించిన శ్రీరామలింగేశ్వరస్వామి వారికి బంగారు కళ్ళను ఎమ్మెల్యే ఆలయ అర్చకులకు అందజేశారు. అనంతరం స్వామివారికి అభిషేకం చేశారు. పాంబండ దేవాలయ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ మొగులయ్య, దేవాలయ ఈవో సుధాకర్, బ్లాక్ బీ అధ్యక్షుడు భరత్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, కార్యదర్శి గోపాల్‌నాయక్, మాజీఎంపీపీ అంజిలయ్యగౌడ్, మండల యూత్ అధ్యక్షుడు జంగయ్య, కులకచర్ల ఎంపీటీసీ ఆనంద్, పార్టీ నాయకులు బాలముకుందం, సంజీవరెడ్డి, న్యాయవాది నర్సింహులు, రాహుల్‌నాయక్, విఠల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి ఆలయంలోకి వెండి కిరీటంతో వెళ్తున్న పరిగి ఎమ్మెల్యే దంపతులు

అసహజ శృంగారం కోసం వేధింపులు...
వ్యక్తిపై హత్యాయత్నం



నిందితుడు మితేష్‌కుమార్

ఘట్‌కేసర్‌రూరల్, మార్చి 25 : అసహజ శృంగారం చేయమని నిత్యం వేధిస్తున్న వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడిన యువకుడిని ఘట్‌కేసర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ రామునాయక్ తెలిపిన వివరాల ప్రకారం జనగాం జిల్లా మూన్‌రాయి తండాకు చెందిన భీమానాయక్ మేడ్చల్‌జిల్లా ఘట్‌కేసర్‌లో భార్యాపిల్లలతో ఉంటూ కూలీ పనులు చేసుకుంటాడు. వారం రోజుల క్రితం స్థానిక బస్టాండ్‌అవరణలో కొండాపూర్‌లోని ఓ డైయిరీలో పని చేస్తున్న బిహార్‌కు చెందిన మితేష్‌కుమార్(25) భీమానాయక్‌కు పరిచయమయ్యాడు. కూలీపనులు ఉన్నప్పుడు చెబుతా రావాలని యువకుడి వద్ద నుంచి భీమానాయక్ ఫోన్ నెంబర్ తీసుకున్నాడు. అప్పటి నుంచి ఫోన్ చేస్తూ అసహజ శృంగారం చేయాలని కోరాడు. మితేష్‌కుమార్ నిరాకరించడంతో అసభ్యంగా తిడుతూ చంపుతానని బెదిరింపులకు దిగాడు. రాత్రింబవళ్లు ఫోన్ చేస్తూ వేధింపులకు దిగడంతో ఏలాగైన భీమానాయక్‌ను చంపాలని పథకం వేశాడు మితేష్‌కుమార్. ఈక్రమంలో ఆదివారం సాయంత్రం భీమానాయక్‌కు మితేష్‌కుమార్ ఫోన్‌చేసి తాను నివాసం ఉంటున్న కొండాపూర్‌లోని డెయిరీకి రావాలని, మద్యంతాగి హోమో సెక్స్ చేసుకుందామని నమ్మబలికాడు. అతని మాటలు నమ్మిన భీమానాయక్ అక్కడి వెళ్లగా మద్యం తాగించి తన వద్దఉన్న కత్తితో భీమానాయక్ కడుపులో మూడు సార్లు పొడిచాడు. దీంతో తీవ్రరక్త గాయాలతో కేకలు వేస్తూ రోడ్డుపైకి వచ్చాడు. గమనించిన వాహనాదారుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు బాధితున్ని చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. నిందితునిడి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం

» మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 25: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. మండలంలోని కాచవానిసింగారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు సోమవారం శామీర్‌పేటలోని ఈటల రాజేందర్ నివాసంలో బీజేపీలో చేరారు. ఈటల వారికి బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ మూడవసారి దేశప్రధాని కావడం ఖాయమని ధీమావ్యక్తం చేశారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తాయని గుర్తుచేశారు. అవినీతిలేని పాలన బీజేపీతోనే సాధ్యమన్నారు. దేశంలో ఇండియా కూటమి తమకు ఎక్కడా పోటీ ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఎంపీ అభ్యర్థులు దొరకడం లేదన్నారు. బీజేపీ గెలుపునకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని సూచించారు. పార్టీకోసం పనిచేసే కార్యకర్తలను పార్టీ ఎప్పుడూ గుర్తిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, మండల అధ్యక్షుడు చలువాది ప్రవీణ్‌రావు, కార్యదర్శి ప్రభంజన్‌గౌడ్, నాయకులు బసవరాజుగౌడ్, నాయకులు అశోక్, శివరాజ్‌గౌడ్, రామకృష్ణ, రఘుగౌడ్, సత్యనారాయణ, వినయ్, మహేష్, నవీన్‌యాదవ్, వెంకటన్న, కిరణ్, ప్రశాంత్, అకాష్, రాజు నవీన్ తదితరులు పాల్గొన్నారు.



ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరిన కాచవాని సింగారం బీఆర్ఎస్ నాయకులు

బీజేపీతోనే యువత భవిష్యత్తు

మేడ్చల్ టౌన్, మార్చి 25: కేంద్రంలో నరేంద్ర మోదీ మూడో సారి ప్రధాన మంత్రి అవుతేనే యువకులకు ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. మండలంలోని బండమాదారం గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు సోమవారం రూరల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. కొత్తగా పార్టీలో చేరిన వారికి ఈటల రాజేందర్ కండువాకప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ ముచ్చటగా మూడోసారి ప్రధానమంత్రి పదవి చేపట్టినప్పుడే దేశం సమగ్రాభివృద్ధి సాధిస్తుందని అన్నారు. నేడు భారత్‌కు విశ్వగురువు ఖ్యాతిని తీసుకొచ్చిన ఘనత ప్రధాని మాదీదన్నారు. ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత ప్రతీ యువకుడిపై ఉందన్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి నేడు భారీఎత్తున ఇతర పార్టీల నుంచి బీజేపీలో చేరుతున్నారన్నారు. అన్నివార్గాలకు ప్రాధాన్యతనిస్తూ దేశాభివృద్ధికి తోడ్పడుతున్న ఏకైక పార్టీ బీజేపీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి పాల్గొన్నారు.



బీజేపీలో చేరుతున్న పలువురు బీఆర్ఎస్ నాయకులు

ప్రత్యేక అలంకరణలో
వేంకటేశ్వరస్వామి

కొడంగల్, మార్చి 25: పేదల తిరుపతిగా పేరొందిన కొడంగల్ శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. అమ్మవారి జన్మదినం సందర్భంగా విశేషపూజలు నిర్వహించారు. అమ్మవారి ఆస్థాన మండపంలో తిరుచ్చిపై వేంచేపు చేసి పూలమాలలతో అలంకరించారు. దేవస్థానం తరపున అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



31న దేవుని పడకల్ లో అంతర్ రాష్ట్ర బండ లాగుడు పోటీలు



తలకొండపల్లి , మార్చి 25 : తలకొండపల్లి మండలం దేవుని పడకల్ గ్రామంలో ఈనెల 31న అంతర్ రాష్ట్ర బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు కాంగ్రెస్ జిల్లా నాయకుడు కాసు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే బండలాగుడు పోటీలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. సోమవారం ఏర్పాట్లను పరిశీలించారు. మాజీ సర్పంచ్ కాడెమోని శ్రీశైలం మాట్లాడుతూ పోటీల్లో విజేతలకు మొదటి బహుమతిగా రూ.1,00,116, రెండవ బహుమతి రూ.75,116, మూడవ బహుమతి రూ. 50,116, నాలుగవ బహుమతి రూ.30,166, ఐదవ బహుమతి రూ. 20,116తో పాటు ప్రోత్సాహక బహుమతులు రూ.8,116 లచొప్పున అందజేయడం జరుగుతుందని చెప్పారు. పోటీల ప్రారంభానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎంపీ డాక్టర్ మల్లు రవి , మాజీ ఎమ్మెల్యేలు చల్లా వంశీచందర్‌రెడ్డి, గుర్కా జైపాల్ యాదవ్, తదితర నాయకులు హాజరవుతారని ఆలయ చైర్మన్ లట్టుపల్లి రాజ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.



పులుమామిడి పంచాయతీ భవనం ముందు పడేసిన కంకర, చెత్తచెదారం

పంచాయతీ ఎదుట కంకర,చెత్త చెదారం

» పట్టించుకోని పంచాయతీ అధికారులు

వికారాబాద్, మార్చి 25: నవాబుపేట మండలంలోని పులుమామిడి గ్రామ పంచాయతీ భవనం ముందు కంకర, చెత్త చెదారంతో గ్రామస్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. క్షేత్ర స్థాయిలో అధికారుల పర్యవేక్షణ లోపంతో గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే తిష్ట వేశాయని ప్రజలు వాపోతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శికి తెలిపినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపించారు.

బస్టాండ్‌లో సీసీ రోడ్డు వేయాలి

యాచారం, మార్చి 25 : యాచారం మండల కేంద్రంలోని బస్టాండ్‌లో సీసీ రోడ్డు వేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. బస్టాండ్‌లో సీసీ రోడ్డు లేకపోవడంతో దుమ్ము, దూళి మీద పడి ఇబ్బంది పడుతున్నామని పలువురు ప్రయాణికులు చెప్పారు. బస్సుల రాకపోకల సందర్భంగా లేచే దుమ్ము తమ ఇళ్లు, షాపుల్లోకి వస్తున్నదని స్థానికులు వాపోతున్నారు. యాచారం గ్రామ పంచాయతీ, జడ్పీ నిధుల, ఎంపీ నిధుల నుంచి బస్టాండ్‌లో సీసీ రోడ్డు వేయాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో నరేందర్ రెడ్డితో ప్రస్తావించగా బస్టాండ్‌లో సీసీ రోడ్డు నిర్మాణం కోసం సుమారుగా రూ.16లక్షల వ్యయమవుతుందన్నారు.



ఖాకీలకు కష్టకాలం

» బడ్జెట్ పద్దులపై పోలీసు ఉద్యోగుల్లో చర్చ
» చెల్లింపులకు ఈ ఏడాది ఐదు రోజులే గడువు
» ఇతర జిల్లాల్లో విడుదల
» సీఎం సొంత జిల్లాలో పెండింగ్

తాండూరు: మార్చి 25: పోలీస్ శాఖలో పని చేసే ఉద్యోగులకు బడ్జెట్ బిల్లులు వస్తాయో, రావో అన్న భయం పట్టుకుంటుంది. మార్చి 31వ తేదీతో బడ్జెట్ పద్దుల చెల్లింపు గడువు ముగుస్తోంది. బడ్జెట్‌పద్దుల కింద వచ్చే చెల్లింపు గడువు ఇంకా ఐదు రోజులే మిగిలి ఉంది. దీంతో ప్రభుత్వం ఇప్పటికైనా చెల్లింపు చేసేలా చూడాలని వికారాబాద్ జిల్లా పోలీసులు కోరుతున్నారు. ఈ ఏడాది పోలీసు శాఖలో సరెండర్ బిల్స్, 11నెలల టీఏ బిల్స్, డీఏ ఎరియన్స్, గత పీఆర్‌సీ ఏరియన్స్, మెడికల్ బిల్లులతో పాటు పలు రకాల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇవన్నీ పోలీస్ శాఖలో బడ్జెట్ పద్దుల కింద ప్రభుత్వం చెల్లిస్తుంది. అయితే, ఇంకా బిల్లులు చెల్లించలేదు. ఇంటి అద్దెలు, వ్యక్తిగత కుటుంబ అవసరాల కోసం చేసిన అప్పులు, ఈఎంఐలు చెల్లించడానికీ ఇబ్బందిగా మారిందని పలువురు పోలీసులు వాపోతున్నారు.



పోలీసుల వివరాలు..

వికారాబాద్ జిల్లాలో వెయ్యి మంది పోలీస్ సిబ్బంది ఉన్నారు. మరో 110మంది పోలీస్ అధికారులు ఉన్నారు. మొత్తం జిల్లా వ్యాప్తంగా 1110 మంది పోలీసులు ఉన్నారు. వీరందరికీ బడ్జెట్ కింద మంజూరయ్యే టీఏ, డీఏ, మెడికల్ రీయింబర్స్‌మెంట్‌లను ఈ ఏడాది (2023-24) ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లోనే మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

మంత్రుల జిల్లాలో మంజూరు.. సీఎం జిల్లాలో పెండింగ్

మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేష్, పొన్నం ప్రభాకర్‌లు తమ తమ జిల్లాలోని ఉద్యోగసంఘాలు, ఉద్యోగులు, పోలీసులకు పెండింగ్ బిల్లుల విషయంలో రాష్ట్ర ఆర్థిక శాఖ అధికారులతో మాట్లాడి బిల్లులను మంజూరు చేయించారు. అయితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిత్యం వహిస్తున్న వికారాబాద్ జిల్లాలో మాత్రం చెల్లింపులు ఇంకా కాకపోవడం గమనార్హం. ఈ విషయాన్ని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ దృష్టికి తీసుకెళ్లినట్లు స్థానిక పోలీసులు చెబుతున్నారు. స్పందించిన ఆయన అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని అంటున్నారు. అయితే ఇంకా ఐదు రోజులు మాత్రమే గడువు ఉండటంతో స్థానిక పోలీసులు బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా వికారాబాద్ జిల్లాలో బిల్లుల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని పోలీసులు, ఉద్యోగ సంఘాల నాయకులు కోరుతున్నారు.


కొడంగల్: హోలీ సంబురాల్లో పాల్గొన్న యువకులు, మహిళలు


వికారాబాద్: హోలీ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేమెతుకు ఆనంద్


బషీరాబాద్‌లో ఎంపీపీ నివాసం ఎదుట యువకుల హోలీ సంబురాలు


పూడూరు: మండలంలోని కంకల్‌లో హోలీ సంబురాల్లో యువకులు, చిన్నారులు

ఆనందోత్సాహంతో హోలీ వేడుకలు

వికారాబాద్, మార్చి 25: హోలీ పండుగను జిల్లా ప్రజలందరూ ఆనందోత్సవాలతో నిర్వహించుకున్నారు. సోమవారం రాత్రి పట్టణంలో, మండలంలోని ఆయా గ్రామాల్లో కామదహనం నిర్వహించారు. సోమవారం తెల్లవారుజాము నుంచి హోలీ వేడుకల్లో ప్రజలు పాల్గొన్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా అందరూ రంగులు చల్లుకుని ఆనందంగా గడిపారు. జిల్లా కేంద్రంలో ఏరోడ్డుపై చూసినా, ఏవీధిలో చూసిన రంగుల పండుగలో ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అందరూ ఒక్క వద్ద చేసి డీజే పాటలు పెట్టుకుని సందడి చేశారు. ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌తో పాటు ప్రజా ప్రతినిధులు అధికారులు పెద్దఎత్తున పాల్గొన్నారు. అదే విధంగా నవాబుపేట మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం హోలీ సంబరాలను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. రంగులు చల్లుకుని హోలీ శుభాకాంక్షలు తెలిపారు.

మర్పల్లి: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో సోమవారం హోలీ సంబురాలు అంబరాన్నంటాయి. ఆదివారం రాత్రి డప్పుల చప్పుళ్లు, కేరింతలతో కామదహనం నిర్వహించారు. సోమవారం తెల్లవారుజాము నుంచే ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండలంలోని బూచన్‌పల్లి గ్రామంలో హోలీ సంబరాల అనంతరం బక్కప్పస్వామి ఆలయం నుంచి హనుమాన్ ఆలయం వరకు రథాన్ని తీసుకొచ్చారు. త్వరలో బక్కప్పస్వామి జాతర ఉత్సవాలు నిర్వహించి రథాన్ని ఊరేగిస్తామని గ్రామస్తులు తెలిపారు.


వికారాబాద్: గరిబ్‌నగర్‌లో హోలీ సంబురాల్లో కాలనీ వాసులు

ధారూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం హోలీ పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఆదివారం రాత్రి కామదహనం చేసి ఉదయం హోలీ ఆడారు. చిన్నారులు, యువతీ, యువకులు రంగులు చల్లుకుంటూ ఉల్లాసంగా గడిపారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో..

మేడ్చల్ టౌన్: మేడ్చల్ జిల్లాలో హోలీ సంబురాలు అంబరాన్నంటాయి. ఆదివారం రాత్రి మేడ్చల్ గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో కామదహనం చేశారు. సోమవారం ఉదయం బస్తీలు, వీధుల్లో యువకులు, పిల్లలు రంగులు చల్లుకున్నారు. హోలీ పండుగను పురస్కరించుకుని మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీల్లోని పలు కాలనీల్లో, అపార్టుమెంట్లలో ప్రత్యేక హోలీ కార్యక్రమాలు నిర్వహించారు. మేడ్చల్ పట్టణం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో వినాయక్‌నగర్‌లో కాంగ్రెస్‌పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాఘవేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో 18వార్డులో హోలీ వేడుకలు నిర్వహించారు.

కీసర: హోలీ సంబురాలు కీసరలో ఘనంగా జరిగాయి. సోమవారం జరిగిన హోలీ వేడుకల్లో భాగంగా మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం రాత్రి కామదహనం నిర్వహించారు. అనంతరం సోమవారం చిన్నాపెద్దా తేడా లేకుండా స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని రంగులు చల్లుకున్నారు.

ఘట్‌కేసర్: పోచారం మున్సిపాలిటీలలో కాలనీలు, అపార్టుమెంట్లలో ఒకరినొకరు రంగులు చల్లుకున్నారు. ఘట్‌కేసర్‌లో కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ కమిటీ నిర్వహకులు హోలీ సంబురాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలో చిన్నారులు రంగులు చల్లుకొని ఆనందోత్సవాల మధ్య హోలీని నిర్వహించుకున్నారు. ఘట్‌కేసర్‌లోనూ పలుచోట్ల చిన్నారులు వీదుల్లోకి వచ్చి రంగులు చల్లుకోవడం కనిపించింది. ఆదివారం రాత్రి ప్రధాన చౌరస్తాల్లో కామదహనాలు నిర్వహించారు.

ఘట్‌కేసర్ రూరల్: మండలంలో సోమవారం హోలీ వేడుకలను ఆనందోత్సవాల మధ్య నిర్వహించుకున్నారు. వయసుతో సంబంధం లేకుండా అందరూ రంగులు చల్లుకుని హోలీ ఆడారు. ఉదయం నుంచే చిన్నారులు, యువకులు, పెద్దలు, రంగులతో వీధుల్లో సందడి చేశారు. అవుషాపూర్, అంకుషాపూర్, ఎదులాబాద్, మాదారం, మర్రిపల్లిగూడ, ఎదులాబాద్, కొర్రెముల, ఘనాపూర్, కాచవానిసింగారం, ప్రతాప్‌సింగారం, వెంకటాపూర్ గ్రామాల్లో ఆదివారం రాత్రి కామదహనం చేశారు. డప్పు చప్పులతో ఇళ్ళలో తిరుగుతూ హోలీ ఇనాం అడిగి తీసుకున్నారు.


మేడ్చల్ టౌన్: 18వార్డులో హోలీ సందర్భంగా ఊరేగింపు


ఘట్‌కేసర్: హోలీ వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు


ఘట్‌కేసర్ రూరల్: అవుషాపూర్‌లో హోలీ సంబరాల్లో యువకులు


కీసర: కామ దహనం చేస్తున్న గ్రామస్తులు


ఘట్‌కేసర్: అన్నోజిగూడలో రంగులు పూసుకుంటున్న చిన్నారులు

పరిగి: హోలీ పండుగ సందర్భంగా పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్, జడ్పీటీసీ బి.హరిప్రియ తదితరులు సంబురాల్లో పాల్గొన్నారు. పట్టణంలోని టీచర్ కాలనీలో హోలీ సంబరాల్లో మున్సిపల్ కౌన్సిలర్ రవీంద్ర కాలనీ వాసులతో కలసి కామదహనం చేశారు. కాగా ఉదయం హోలీ సంబరాల్లో పాల్గొని యువకులతో కలసి రంగులు జల్లుకున్నారు.

కులకచర్ల: కులకచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలోని గ్రామాల్లో ప్రజలు సోమవారం హోలీ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి కామదహనం చేశారు. సోమవారం ఉదయం నుంచి చెన్నాపెద్దా తేడా లేకుండా మహిళలు హోలీ సంబురాల్లో పాల్గొని రంగులు చల్లుకున్నారు. కులకచర్ల, తిరుమలాపూర్, చౌడాపూర్, ఘనపూర్ తదితర గ్రామాల్లో యువకులు రోడ్లపైకి చేరి రంగులు చల్లుకొని సంబరాలు చేసుకున్నారు.

పూడూరు: మండలంలో సోమవారం రంగుల పండుగను వైభవంగా నిర్వహించారు. యువకులు, చిన్నారులు ఒకచోట చేరి రంగులు చల్లుకున్నారు. వీధుల్లో తిరుగుతూ డ్యాన్సులు చేస్తూ హోలీ సంబరాల్లో పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో సంబురాలు అంబరాన్నంటాయి.

తాండూరు రూరల్: మండలంలో హోలీ పండుగను యువకులు, చిన్నారులు సోమవారం ఘనంగా నిర్వహించారు. అంతారంలో పాటు తదితర గ్రామాల్లో చిన్నారులు, యువకులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. వీధుల్లో తిరుగుతూ ఒకరిపై ఒకరు రంగులు, రంగునీళ్లు చల్లుకుంటూ డ్యాన్సులు చేశారు. మధ్యాహ్నం 12గంటల వరకు ఉత్సాహంగా రంగుల పండుగలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

పెద్దేముల్: గ్రామాల్లో హోలీ పండుగను సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. చిన్నారులు, యువకులు ఉదయం నుంచే ఇళ్ల నుంచి రంగుడబ్బాలతో రోడ్లపైకి వచ్చి సందడి చేశారు. రోడ్లపై ఎక్కడ చూసినా రంగులతో యువకులు తిరుగుతూ కనిపించిన ప్రతీఒక్కరికి రంగులు చల్లారు. మధ్యాహ్నం వరకు హోలీ పండుగను జరుపుకున్నారు.

బషీరాబాద్: మండల కేంద్రంతో ఆయా గ్రామాల్లో హోలీ పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు. బషీరాబాద్, పర్వత్‌పల్లి, జీవన్గి, మైల్వార్, దామర్‌చెడ్, కాశీంపూర్ తదితర గ్రామాల్లో చిన్న, పెద్ద తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. గ్రామీణప్రాంత విద్యార్థులు, యువకులు సమీప పొలాల్లో మోదుగ చెట్లనుంచి పూలు సేకరించి సహజసిద్ధమైన రంగులు చల్లుకున్నారు.

యాలాల: మండల కేంద్రంలో సోమవారం హోలీ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. యాలాల గ్రామనికి చెందిన కాంగ్రెస్ నాయకులు పేరి రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో డప్పుచప్పుళ్లతో ప్రతీవాడలో తిరుగుతూ పలురకాల రంగులు ఒకరిపై ఒకరు చల్లుకుంటూ సంబురాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెకడ్డి, అగ్గనూరు మాజీ సర్పంచ్ భీమప్ప, కేవీపీఎస్ నాయకులు మల్కప్ప, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బుగ్గప్ప, కాంగ్రెస్ నాయ కులు అశోక్, లాలు, యాదగిరి, మహిళలు, యువకు పాల్గొన్నారు.

కొడంగల్/కొడంగల్ రూరల్: కొడంగల్ మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. ఒకరికొకరు రంగులు పూసుకొని పండగ శుభాకాంక్షలు తెలిపారు. కొడంగల్ మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డులతో పాటు గ్రామాల్లో యువకులు, చిన్నారులు హోలీ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

దోమ: మండల వ్యాప్తంగా హోలీ సంబరాలను ఘనంగా నిర్వహించారు. యువకుల కేరింతలు, ఆనందోత్సహాల నడుమ మండలంలోని శివారెడ్డిపల్లి, దొంగఎన్కెపల్లి, గూడూరు, బాసుపల్లి, మైలారం, మోత్కుర్, కిష్టాపూర్ తదితర గ్రామాల్లో యువకులు, చిన్నారులు ఒకరికొకరు రంగులు పూసుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిదులు, యువకులు పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో సోమవారం హోలీ పండుగను పురస్కరించుకుని యువకులు, చిన్నారులు రోడ్లపైకి చేరి రంగులు చల్లుకున్నారు. యువకులు, చిన్నారులు కేరింతలు కొడుతూ ఉల్లాసంగా గడిపారు.

బొంరాస్‌పేట్: బొంరాస్‌పేట్, దుద్యాల మండలాల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సోమవారం హోలీ పండగను యువకులు, చిన్నారులు, మహిళలు ఘనంగా నిర్వహించారు. ఒకరిపై ఒకరురంగులు చల్లుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పలువురు మహిళలు ఇంటింటికి వెళ్లి హోలీ పాటలతో ధాన్యం, డబ్బులు తీసుకుంటూ ముందుకు సాగారు.


మర్పల్లి: బూచన్‌పల్లిలో హోలీ వేడుక అనంతరం బక్కప్పస్వామి రథాన్ని లాగుతున్న గ్రామస్తులు


పరిగి: హోలీ సంబురాల్లో నాయకులు


పెద్దేముల్‌లో హోలీ ఆడుతున్న యువకులు


కులకచర్ల: ఘనపూర్‌లో హోలీ సంబురాల్లో పాల్గొన్న ప్రజలు


కొడంగల్‌లో రంగులు పూసుకుంటున్న యువకులు, చిన్నారులు


వికారాబాద్: ఇంద్రానగర్ కాలనీలో హోలీ వేడుకల్లో చిన్నారులు


మోమిన్‌పేట్‌లో హోలీ సంబురాలు


యాలాలలో హోలీ సంబురాల్లో పాల్గొన్న గ్రామస్తులు


తాండూరు రూరల్: అంతారంలో హోలీ ఆడుతున్న విద్యార్థులు

మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చిప్పల నర్సింగ్‌రావు

ఘట్‌కేసర్, మార్చి 25: జాతీయ మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మండలంలోని కొర్రెములకు చెందిన చిప్పల నర్సింగ్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ సోమవారం ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చిప్పల నర్సింగ్‌రావు మాట్లాడుతూ మాలల అభ్యున్నతికి నిరంతరం కృషిచేయనున్నట్లు నర్సింగ్‌రావు తెలిపారు.ఐక్యంగా ఉండి హక్కుల కోసం పోరాటం చేయాలన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా రాణించాలని కోరారు. తనను జాతీయ మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించినందుకు జాతీయ మాలమహానాడు అధ్యక్షుడు అద్దంకి దయాకర్‌కు దన్యవాదాలు తెలిపారు.


నర్సింగ్‌రావు

కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుంటాం

● అక్నాపూర్ మాజీ సర్పంచ్ తలారి అజయ్‌కుమార్

వికారాబాద్, మార్చి 25: బీఆర్ఎస్ పార్టీ తరఫున చేవెళ్ల నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని అక్నాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ తలారి అజయ్‌కుమార్ అన్నారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ కాసాని జ్ఞానేశ్వర్ గతంలో జిల్లా పరిషత్ చైర్మన్‌గా, ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు నవాబుపేట మండలానికి అధిక సంఖ్యలో నిధులు మంజూరు చేయించి మండల అభివృద్ధికి కృషి చేశారన్నారు. కాసాని జ్ఞానేశ్వర్‌కు ముదిరాజ్‌ల మద్దతు ఉండటంతో పాటు పట్టు ఉన్న వ్యక్తి అన్నారు. చేవెళ్ల గడ్డపై బీఆర్ఎస్ ఎంపీ గెలుపొందడం ఖాయమన్నారు.



ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 25: విద్యార్థులు ఉద్యోగాలకు కావాల్సిన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఇవోక్ టెక్నాలజీ అసోసియేట్ డైరెక్టర్ జితేంద్రవంగ తెలిపారు. మండలంలోని వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో సోమవారం ఐటీ నియామకాలు- కార్పొరేట్ దృక్పథంపై జరిగిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. కార్పొరేట్ సంస్థల్లో ఆధునిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఆధునిక సాంకేతిక విప్లవానికి అనుగుణంగా ముందుకు సాగాలన్నారు. నూతన పరిశోధనలకు శ్రీకారం చుట్టాలని తెలిపారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదువాలని, అప్పుడే ఈ పోటీ ప్రపంచంలో నిలబడగలుగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనురాగ్ యూనివర్సిటీ సీఎస్‌సీ హెచ్‌వోడీ విష్ణుమూర్తి, డీన్ విజయ్‌కుమార్, శంకర్, అధ్యాపకులు రాజశేఖర్‌రెడ్డి, సంధ్యారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.


సదస్సులో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

ఎట్టకేలకు డ్రైనేజీ పనులు షురూ

మేడ్చల్ టౌన్, మార్చి 25 : సంవత్సరం పాటు పెండింగ్‌లో ఉన్న మేడ్చల్ మున్సిపాలిటీ ఎన్‌జీఓ కాలనీ అంతర్గత డ్రైనేజీ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. మున్సిపల్ పరిధిలోని 16, 5వ వార్డుల పరిధిలోకి వచ్చే ఎన్‌జీవో కాలనీకి చెందిన ఓ వీధిలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ స్థానికులు రెండు సంవత్సరాలుగా ఇటు ప్రజాప్రతినిధులను, అటు అధికారులను పలు మార్లు కోరినప్పటికీ ఎవ్వరూ పట్టించుకోలేదు. ఈ కాలనీలో రోడ్డుకు ఒకపక్కన నివసించే వారి ఓట్లు 5వ వార్డులో, మరో పక్క ఉన్న ఓటర్లు 16వార్డు పరిధిలోకి వస్తాయి. దీంతో ఈ వీధి అభివృద్ధిని ఇద్దరు కౌన్సిలర్లు పూర్తిగా విస్మరించారు. చివరికి స్థానికులు మున్సిపల్ డీఈ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డిని కలిసి కాలనీ సమస్యను వివరించారు. దీంతో స్పందించిన వారు వెంటనే కాంట్రాక్టర్‌ను పిలిచి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. రెండు మూడు రోజుల్లో పనులు పూర్తవుతాయని అధికారులు తెలిపారు.


ఎన్‌జీఓ కాలనీలో ప్రారంభమైన అంతర్గత డ్రైనేజీ పనులు

క్రైం కార్నర్

వ్యక్తి అదృశ్యం

కీసర రూరల్, మార్చి 25: ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన సోమవారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కీసర సీఐ వెంకటయ్య కథనం ప్రకారం.. నాగారం మున్సిపాలిటీ రాంపల్లి రోజ్‌గార్డెన్‌కు చెందిన సుంకోజు లక్ష్మణచారికి ఇద్దరు కుమారులు, ఒకకుమార్తె. కాగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అయిన పెద్దకుమారుడు సుంకోజు మణిరత్నంకు స్వాతి(లక్ష్మి) అనే అమ్మాయితో మూడేళ్ల కిందట వివాహమైంది. గత సంవత్సరం నుంచి కొడుకు, కోడలు గొడవపడుతున్నారు. గతనెల 29న భర్తతో గొడవపడిన స్వాతి(లక్ష్మి) జవహర్‌నగర్‌లోని పుట్టింటికి వెళ్లిపోయింది. ఈనెల 23న సాయంత్రం మణిరత్నం వాకింగ్ వెళ్తున్నానని తన తల్లి అండాలుకు చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. వాకింగ్‌కు వెళ్లిన అతను ఎంతకీ తిరిగి ఇంటికి రాలేదు. ఫోన్ చేయగా స్విచ్చాఫ్ వచ్చింది. బంధువులు, మిత్రుల వద్ద, సమీప ప్రదేశాల్లో వెతికినా ఫలితం లేకుండా పోయింది. దీంతో కీసర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు కీసర పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు.


సుంకోజు మణిరత్నం

లారీ ఢీకొని యువకుడి మృతి

పరిగి, మార్చి 25: లారీ ఢీకొని యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం రాత్రి జరిగింది. దోమ మండలం బ్రాహ్మణ్‌పల్లి పెద్ద తండాకు చెందిన సేనావత్ నరేష్(23) సోమవారం రాత్రి బైక్‌పై పరిగికి వస్తుండగా పరిగి నుంచి గడిసింగాపూర్ వైపు వెళ్తున్న లారీ వేగంగా వస్తూ బైక్‌ను ఢీకొట్టింది. బైక్‌పై ఉన్న నరేష్ తీవ్రగాయాల పాలు కాగా చికిత్స నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే నరేష్ అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి హన్మానాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్ తెలిపారు.


మృతుడు నరేష్